ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ కూచిపూడి నృత్య నిలయం సంస్థ ఆధ్వర్యంలో కులపతి భాగవతుల రామకోటయ్య శత జయంత్యుత్సవాలను మంగళవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. అనాదిగా ప్రపంచమంతటా స్త్రీలపై జరుగుతున్న హింసపై రచయిత్రి ఓల్గ రచనలతో, కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత భాగవతుల సేతురామ్ నృత్య రూపకల్పనలో సాగిన లక్ష్మణ రేఖ, నృత్య రూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేనా, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, రచయిత్రి ఓల్గా, ప్రొఫెసర్ అనురాధ, నృత్య గురువు భాగవతుల సేతు రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం



నవనీతను సత్కరిస్తున్న అమృత్‌కుమార్ జైన్, సూరెపల్లి రవికుమార్

అబిడ్స్: నవభారత్ నిర్మాణ్ సంఘ్ ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం అబిడ్స్ రాఘవ రత్న టవర్‌లో పుడమిని కాపాడుకుంటేనే మనిషికి భవిష్యత్తు అంటూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంఘ సేవకుడు అమృత్‌కుమార్ జైన్, నవభారత్ నిర్మాణ్ సంఘ్ అధ్యక్షుడు సూరెపల్లి రవికుమార్ కవయిత్రి రాజగిరి నవనీతను ఘనంగా సత్కరించారు.

సత్తాచాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు



నస్రా ఫాతిమా



నిఖత్ ఫాతిమా

గోల్కొండ: ఇంటర్ ఫలితాల్లో గోల్కొండలోని బాలికల బీజేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సత్తాచాటింది. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించామని కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవి తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని నస్రా ఫాతిమా 1000/976 మార్కులు, సాధియా బేగం (969) మార్కులు, సీఈసీ రెండో సంవత్సరం విద్యార్థిని నిఖత్ ఫాతిమా(893) మార్కులు సాధించారని తెలిపారు. అదే విధంగా మొదటి సంవత్సరంలో కూడా బాలికలు మంచి ఫలితాలు సాధించారని ఆమె తెలిపారు. మొదటి సంవత్సరం 60శాతం మంది విద్యార్థినులు, రెండో సంవత్సరం 65 శాతం విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

మే 4న కాచిగూడ ఆరె కటిక సంఘం ఎన్నికలు



సుల్తాన్‌బజార్: కాచిగూడ ఆరెకటిక సంఘానికి (152/2019) ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. మంగళవారం కోఠిలోని సంఘం కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆరె కటిక ట్రస్ట్ చైర్మన్ జమాల్‌పూర్ బాల్‌రాజ్ ఎన్నికల తేదీని ప్రకటించారు. మే 4న ఈ సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ నెల 23, 24 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. 25న నామినేషన్ల ఉపసంహరణ, 26న స్క్రూటినీ నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని మండల, పట్టణ నియోజకవర్గ స్థాయిలో అన్ని జిల్లా కేంద్రాల్లో సైతం బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆరె కటిక ఎలక్షన్ కమిటీ కార్యదర్శి డాక్టర్ నిజాంకారి చంద్రశేఖర్, నాయకులు గెట్టికారి గోవిందు రాజ్, యాంకర్ ప్రేమ్‌కుమార్, సంజయ్ రాజ్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో నిత్యశ్రీ ప్రతిభ



జూలూరి నిత్యశ్రీ

గన్‌ఫౌండ్రీ: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో సైఫాబాద్ ఫిడ్జ్ కళాశాల విద్యార్థిని జూలూరి నిత్యశ్రీ ప్రతిభ కనబరిచింది. 1000 మార్కులకు గాను 989 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో సత్తాచాటారు. ఈ సందర్భంగా విద్యార్థిని నిత్యశ్రీ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చదివి రిసర్చ్ చేస్తానన్నారు. కంప్యూటర్ విభాగంలో మాస్టర్స్ చేయడమే ధ్యేయమన్నారు. ఫిడ్జ్ కళాశాల అధ్యాపకుల సహకారంతో ఈ మార్కులు సాధించానని పేర్కొన్నారు.

పత్తర్‌గట్టిని పట్టించుకోరా..?

- 16 ఏళ్లుగా ఎలాంటి మరమ్మతులకు నోచుకోని వైనం
- శిథిలావస్థకు చేరిన పత్తర్‌గట్టి వ్యాపార సముదాయం
- గత నెల 26న కిటికీ గచ్చు ఊడి పడినా పట్టించుకోని అధికారులు



శిథిలావస్థలో పత్తర్‌గట్టిలోని వారసత్వ సంపద రాతి కట్టడాల వ్యాపార సముదాయం

చార్మినార్: నిజాం కాలంలో పూర్తిగా రాళ్లతో నిర్మించిన పత్తర్‌గట్టి వ్యాపార సముదాయాలతో కూడిన భవన సముదాయం శిథిలావస్థకు చేరింది. నగరం నుంచి చార్మినార్ వైపు వస్తున్న దారిలో మదీనా సర్కిల్ నుంచి కొద్దిగా ముందుకు వస్తే..రోడ్డుకు ఇరువైపులా గుల్జార్‌హౌజ్ వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపుల కనిపించే వ్యాపార సముదాయమే పత్తర్‌గట్టి. 16 ఏళ్ల క్రితం పత్తర్‌గట్టి వ్యాపార సముదాయాన్ని మరింత ఆధునీకరించడానికి జీహెచ్‌ఎంసీ అప్పట్లో కార్యక్రమాలను రూపొందించింది. సాండ్ ట్రీట్ మెంట్‌తో పాటు పత్తర్‌గట్టిలోని సైన్ బోర్డులన్నింటినీ యూనిఫాంగా తీర్చిదిద్దడానికి అప్పట్లో సిద్ధమయ్యారు. కొన్ని రోజులు తూతూ మంత్రంగా కొనసాగాయి. అనంతరం ఆయా పనులు అటకెక్కాయి. అటు వైపు కన్నెత్తి చూసిన అధికారులు లేరు. దీంతో ప్రస్తుతం పత్తర్‌గట్టి వ్యాపార సముదాయాలు అక్కడక్కడ శిథిలావస్థకు చేరుకున్నాయి.

గత నెల 26న..

గత నెల 26న ఉన్నట్టుండి పత్తర్‌గట్టిలోని ఓ వ్యాపార సముదాయం పైనున్న కిటికీ గచ్చు ఊడి కింద పడింది. ఒకవైపు రంజాన్ మార్కెట్ కొనసాగుతుండగా..గచ్చు ఊడి కింద పడడంతో స్థానిక చిరువ్యాపారికి స్వల్పంగా గాయాలయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ ఎలాంటి మరమ్మతు పనులు చేపట్ట లేదు. అంతేకాకుండా శిథిలావస్థకు చేరిన పత్తర్‌గట్టికి మరమ్మతు పనులను చేయించడానికి సంబంధిత అధికారులు ముందుకు రావడం లేదు. ఇక ఆధునీకరణ పనుల మాటేమిటో..అని పాతబస్తీ ప్రజలు అంటున్నారు. రాబోయే తరాలకు ఒకప్పటి వారసత్వ కట్టడాలను కాపాడాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. వారసత్వ కట్టడాల పరిరక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొంది కాపాడాల్సిన అవసరం ఉందంటున్నారు.



ఊడి కింద పడిన కిటికీ గచ్చు (ఫైల్)

వారసత్వ సంపద కట్టడాల పరిరక్షణ ఏమాయే..?

పాతబస్తీలోని వారసత్వ సంపద కట్టడాలను పరిరక్షించడానికి గతంలో జీహెచ్‌ఎంసీ రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలు కార్యరూపం దాల్చకుండానే అటకెక్కాయి. 2009లో ఎంతో హడావుడి చేసిన అప్పటి జీహెచ్‌ఎంసీ అధికారులు పనులను పూర్తి చేయలేకపోయారు. తూతూమంత్రంగా జరిగిన ఈ పనులు, ప్రణాళికలు కాగితాలకే పరిమితమయ్యాయి. పూర్తి స్థాయిలో పనులు జరగకుండానే ముగిశాయి. చార్మినార్ ప్రాంతాన్ని వారసత్వ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేసేందుకు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ 2009లో రూ.9.94 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో పాతబస్తీలోని హెరిటేజ్ కట్టడాలను పరిరక్షించడంతో పాటు సుందరీకరణ తదితర కార్యక్రమాలను చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించారు. పత్తర్‌గట్టితో పాటు చార్‌కమాన్‌లను ఆధునీకరించడానికి సిద్ధమయ్యారు. అయితే చార్‌కమాన్ల ఆధునీకరణ పనుల్లో భాగంగా కేవలం మచిలీకమాన్, కాలీకమాన్ పనులు మాత్రమే ప్రారంభించి పూర్తి చేశారు. ఈ పనులు సైతం తూతూ మంత్రంగా కొనసాగాయి. ప్రస్తుతం మచిలీకమాన్‌పై పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి.

27న కళాదర్బార్ 50 వసంతాల వేడుకలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పొత్తూరి రంగారావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 27న రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కళాదర్బార్ సంస్థ 50వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు పొత్తూరి రంగారావు తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్‌లో 50 వసంతాల వేడుకల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మంత్రి జూపల్లి కృష్ణారావు, పలువురు సినీ నటులు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సినిమా, టీవీ, విద్యారంగాల్లో సేవలందిస్తున్న పలువురికి గోల్డెన్ జూబ్లీ ఐకాన్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గాయనీ గాయకుల చేత సంగీత విభావరి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గాయని విజయలక్ష్మి, వైఎస్.రామకృష్ణ, త్రినాథ్‌రావు, చింతలపాటి సురేష్ పాల్గొన్నారు.

తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యులకు పదోన్నతులు కల్పిస్తాం



కమిషనర్ అజయ్‌కుమార్‌తో చర్చలు నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న వైద్యులకు పదోన్నతులు కల్పిస్తామని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో టీవీవీపీ వైద్యులతో కలిసి కమిషనర్ అజయ్‌కుమార్‌తో చర్చలు జరిపారు. ఈ చర్చలు సఫలం కావడంతో సీనియారిటీ ప్రకారం..పదోన్నతులకు కమిషనర్ సుముఖం తెలపడంతో టీవీవీపీ వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ..త్వరలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న వైద్యుల సీనియారిటీ జాబితాను ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా టీవీవీపీ వైద్యులు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ నరహరి, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్ డాక్టర్ రావుఫ్‌తో పాటు కమిషనర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీవీవీపీ వైద్యులు డాక్టర్ సంగీత్, డాక్టర్ రాకేష్, డాక్టర్ దివ్య, డాక్టర్ సుధాకర్, డాక్టర్ అమీర్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్లు శ్వేత, శృతి, శరణ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గౌతమ్‌రావు విజయం ఖాయం



మాట్లాడుతున్న ఉమా మహేందర్

సుల్తాన్‌బజార్: ఈ నెల 23న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డాక్టర్ గౌతమ్‌రావు విజయం ఖాయమని ఆ పార్టీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేందర్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో హిందీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని పార్టీల కార్పొరేటర్లందరూ పాల్గొని తమ అభీష్టం మేరకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ మాట్లాడుతూ..సెక్యులర్ పార్టీలని చెప్పుకుంటున్న పార్టీలు ఎన్నికల్లో పాల్గొనకూడదని ఎలా జారీ చేస్తారన్నారు. ఒక మతానికే పరిమితమైన పార్టీని గెలిపించవద్దన్నారు. బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు వెనక్కి వచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలి



మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: విశ్రాంత ఉద్యోగులకు ఇంటి స్థలాలను వెనక్కి వచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం కొమురెడ్డి అన్నారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఉమ్మడి రాష్ట్రంలో 4 సంఘాల ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం గోపనపల్లి గ్రామంలో అప్పటి ప్రభుత్వం 427 ఎకరాలు కేటాయించిందని తెలిపారు. అందులో బీటీ ఎన్జీఓస్, గచ్చిబౌలి న్యాక్ హౌసింగ్ సొసైటీ వాటాగా 189 ఎకరాలు వచ్చినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం అన్యాయంగా తమకు కేటాయించిన స్థలాన్ని తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఫిబ్రవరిలో కలిసి వినతిపత్రం అందజేశామని ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కానీ నేటికీ ఎలాంటి పురోగతి లేదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి చొరవచూపి తమ ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి, సూర్యకళ, ప్రకాష్‌రావు, లక్ష్మణ్‌రావు, స్వర్ణకుమారి, జయసేనారెడ్డి పాల్గొన్నారు.

మజ్లిస్ నాయకులు క్రియాశీలకంగా ఉండాలి



మహ్మద్ ముస్తాఫాతో మాట్లాడుతున్న యాసర్ అర్ఫాత్

గోల్కొండ: మజ్లిస్ నాయకులు క్రియాశీలకంగా ఉండాలని ఆ పార్టీ యువజన విభాగం నాయకుడు యాసర్ అర్ఫాత్ అన్నారు. షేక్‌పేట్ డివిజన్ మజ్లిస్ సీనియర్ నాయకుడు మహ్మద్ ముస్తాఫా మంగళవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా యాసర్ అర్ఫాత్ మాట్లాడుతూ..వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు వ్యతిరేకిస్తూ గత వారం మజ్లిస్ దారుసలాంలో నిర్వహించిన భారీ బహిరంగ సభ నిర్వహణలో మజ్లిస్ యువజన విభాగం కీలక పాత్ర పోషించిందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ నుంచి యువకులను ఎంపిక చేసి ఒక్కొక్కరికి ప్రభుత్వ కార్యాలయాల బాధ్యతలు అప్పగించడం జరుగుతుందన్నారు. దీన్ని వల్ల సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా వెంట వెంటనే పరిష్కారం అవుతున్నాయన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

యాకుత్‌పురా: సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. డివిజన్‌లోని యాకుత్‌పురా, ఖురేషిలైన్, మదీనానగర్, ఎస్ఆర్టీ కాలనీ, ధోబీఘాట్, రెహ్మత్‌నగర్, యశ్రఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించి స్థానికులతో సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానిక బస్తీలలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా నాలాలు, మ్యాన్‌హోళ్ల పూడిక తీత పనులు చేపట్టామన్నారు. పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఏరియా కమిటీ అధ్యక్షుడు ఏజాజ్ అలీ ఖురేషి, నాయకులు పాల్గొన్నారు.



నేడు డాక్టర్ సంగీతకు షేక్స్పియర్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



చార్మినార్: ప్రముఖ ఆంగ్ల భాష నిపుణురాలు, సాహితీ వేత్త, సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల ఆంగ్లభాష విభాగం హెచ్.ఓ.డి డాక్టర్ సంగీతను ఈ ఏడాది విలి యం షేక్స్పియర్ ఎక్సలెన్స్ అవార్డు– 2025కు ఎంపిక చేసినట్లు వికాస చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కె.రామ్ గోపాల్ రెడ్డి తెలిపారు. విలియం షేక్స్పియర్ జయంతిని పురస్కరించుకొని ఈ అవార్డును ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 23న కింగ్ కోఠిలోని సెంట్ జోసెఫ్ డిగ్రి, పీజీ కళాశాలలో ప్రదానం చేస్తామన్నారు.

హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు

గోల్కొండ: ఈ సంవత్సరం హజ్ తీర్థయాత్రకు ఎంపికైన వారికి గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో వ్యాక్సినేషన్, హెల్త్ క్యాంప్‌లో మంగళవారం 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యానిర్వహణ అధికారి సజ్జాద్ అలీ తెలిపారు. ఈ క్యాంప్ మొత్తం ఐదు రోజులు జరుగుతాయని, ప్రతిరోజు హజ్ కమిటీ వారు 123 మందికి ఈ క్యాంప్‌కు పంపుతున్నారన్నారు.

త్వరలో అందుబాటులోకి నూతన కోర్సులు



వేణుగోపాల్‌రావు, సెట్విన్ ఎండీ

యాకుత్‌పురా: నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనకు మరిన్ని కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నామని సెట్విన్ శిక్షణ సంస్థ ఎండీ వేణుగోపాల్ రావు తెలిపారు. పురానిహవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సంస్థ చైర్మన్ గిరిధర్ రెడ్డి సారథ్యంలో ఇప్పటి వరకు ఉన్న 23 శిక్షణ కేంద్రాలతో పాటు అదనంగా మహబూబ్‌నగర్, నల్గొండ, హుస్నాబాద్, జహీరాబాద్, బోడుప్పల్, జడ్చర్ల ప్రాంతాల్లో నూతన కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. త్వరలో మార్కెట్‌కు అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశ పెట్టనున్నామని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ, ఇంగ్లిష్ లాంగ్వేజెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



విజయనగర్‌కాలనీ: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మంగళవారం ఆసిఫ్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ జిర్రా రోడ్డులో సూరజ్ గార్డెన్ ఫంక్షన్‌హాల్ సమీపాన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



శాతంచెరువు వద్ద డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో దోమలు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం గోల్కొండ శాతం చెరువు వద్ద బల్దియా మలేరియా విభాగం వారు డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారీ చేస్తున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారీ చేయడానికి సరైన సిబ్బందిని నియమించాలన్నారు. కేవలం శాతం చెరువులోనే కాకుండా హెచ్‌ఎండీఏ చెరువు, గోల్కొండ కందకాలు, హకీంపేట్ బుల్కాపూర్ నాలా తదితర ప్రాంతాల్లో సైతం దోమల నివారణ మందు పిచికారీ చేయాలని సూచించారు. సాయంత్రం వేళల్లో బస్తీలు, కాలనీల్లో దోమల నివారణకు దోమల మందును స్ప్రే చేయాలన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

అక్రమ పార్కింగ్‌లకు చెక్

సాక్షి ఎఫెక్ట్..



టోలిచౌకీ రుమాన్ హోటల్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌తో అవస్థలు అనే శీర్షిక సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తకు ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. రెండు రోజుల నుంచి టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్సై షఫీ నేతృత్వంలో టోలిచౌకీ రుమాన్‌హోటల్, సాలర్‌జంగ్ కాలనీ షాగౌస్ హోటల్ తదితర ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్ చేసిన వాహనాలను సీజ్ చేసి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై షఫీ మాట్లాడుతూ..అక్రమ పార్కింగ్‌లను సహించేది లేదని ఈ విషయంపై రాజీపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా రెస్టారెంట్లు, మాల్స్ తదితర ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్‌లను నివారించడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తామన్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ యూనియన్



అబిడ్స్: ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ యూనియన్ ఉంటుందని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. విద్యాశాఖలో ఇద్దరు ఉద్యోగులను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి విన్నవించి కారుణ్య నియామకాల ఉద్యోగాలు కల్పించిన కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీలను విద్యాశాఖ టీఎన్జీఓస్ అధ్యక్షులు కేఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉద్యోగుల సమస్యలన్నీ అంచెలంచెలుగా పరిష్కరిస్తున్న వెల్లడించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డీఈఓ రోహిణి ఎప్పటికప్పుడు ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగి, అరుణజ్యోతి, రమేష్, వరప్రసాద్, మహేందర్, మోహన్, పరమేష్, దామోదర్, రవి, మధులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



ప్రిన్సిపాల్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కాంతారెడ్డి, హరీష్‌కుమార్

విజయనగర్‌కాలనీ: తగిన విద్యార్హలతో దశాబ్దాల పాటుగా యూనివర్సిటీని నమ్ముకొని విద్యాబోధన చేస్తున్న తమకు న్యాయం చేయాలని మాసబ్‌ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం యూనివర్సిటీలో సమావేశమైన సంఘం అధ్యక్షుడు ఎస్.కాంతారెడ్డి, ప్రతినిధులు మునుస్వామినాథన్, ఎస్.హరీష్‌కుమార్, జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..తమ సేవలన ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి సత్వర న్యాయం చేయాలని కోరారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో నేటి నుంచి సమ్మెబాట పడుతున్నట్లు ప్రకటించారు. అనంతరం ప్రభుత్వ ఫైనార్ట్స్ కళాశాల, ప్రభుత్వ ఆర్కిటెక్చర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ ఎం.ఎల్.ఆనంద్‌రావు, ప్రొఫెసర్ సీహెచ్. శ్రీనివాస్‌లకు సమ్మె నోటీసులు అందజేశారు.

చిన్నారులను శాస్త్రీయ కళల్లో ప్రోత్సహించాలి



చిన్నారులతో ఆర్.కృష్ణయ్య తదితరులు

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి శాస్త్రీయ విలువలతో కూడిన పద్ధతులను నేర్పించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో కళారాధన కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ డ్యాన్స్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్నారులను శాస్త్రీయ సంగీత కళలపై తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలువురు నాట్య గురులు, చిన్నారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, నాట్య గురువు పసుమర్తి శేషుబాబు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ సత్యం, సంస్థ వ్యవస్థాపకులు పి.జయంతి పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



నస్రీన్ బేగం



వజీర్ అహ్మద్

గౌలిపురా: గృహిణి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన నస్రీన్ బేగం (30), హమీద్ పాషా దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. నస్రీన్ బేగం గత ఏడాది కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతుంది. దీంతో కుటుంబ సభ్యులు ఎర్రగడ్డలోని మెంటల్ ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నా ఆరోగ్య పరిస్థితి కోలుకోలేదు. కాగా నస్రీన్ బేగం గతంలో ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి వస్తుండేది. ఈ నెల 15న మధ్యాహ్నం 3 గంటలకు నస్రీన్ బేగం బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో వృద్ధుడు..

వృద్ధుడు అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన వజీర్ అహ్మద్ (79) గత నెల 23న సాయంత్రం 5 గంటలకు బయటికి వెళ్లి అదృశ్యమయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాల్లో వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.